క్లుప్తంగా

మానవహక్కులను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

ఉంగుటూరు: మానవహక్కులు ఎవరూ ఉల్లంఘించరాదని ఉంగుటూరు తహసీల్దార్ వెంకట రమణ అన్నారు. నారాయణపురంలో మానవ హక్కులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ అన్ని కులాల వారు కలిసిమెలసి ఉండాలని సూచించారు. పిల్లలను అందర్నీ చదివించాలని, చదువు మాన్పించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల అలకానంద, కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ అడపా శ్రీనివాసరావు, వార్డుమెంబరు నేకూరి ఆశీర్వాదం, సోషల్ వేల్ఫేర్ ఆఫీసర్ మీరాబాయి, హెచ్‌సీ నాగరాజు, వీఆర్వో రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి సత్కారం


గోపన్నపాలెంలో గణేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: అంకితభావంతో పనిచేస్తే ఏ రంగంలోనైనా గుర్తింపు, గౌరవం సాధ్యమేనని గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం సచివాలయంలో జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు పొందిన గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ గణేషను సర్పంచ్ దంపతులు, ఎంపీటీసీలు సువ్వాప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్, ఉపసర్పంచ్ ఏనుగు హేమసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు వీరంకి సత్యనారాయణ, కొండేటి గంగాధరబాబు, మాగంటి కృష్ణమోహన్, కోటేశ్వరరావు శాలువా, పూలదండలతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

బీసీల అభివృద్ధికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారు

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్


కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ

దెందులూరు: జగనన్న చేదోడు పథకంలో జిల్లాలో రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు 15,968 మందికి రూ. 15.96 కోట్ల లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయం నుండి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధి, మెరుగైన జీవన విధానం, భవిష్యత్తు పరిరక్షణకు కట్టుబడి ఉన్నారన్నారు. జిల్లాలో 4419 మంది రజకులకు రూ. 4.42 కోట్లు, 2129 నాయీబ్రాహ్మణులకు రూ.2.13 కోట్లు, 9024 మంది టైలర్లకు రూ. 9.42 కోట్లు సోమవారం వారి ఖాతాలకు నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ అయ్యాయన్నారు. జగనన్న చేదోడు లబ్ధిదారులందరికీ ఎంపీ కోటగిరి శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు.

జబర్దస్త్ టీం సందడి


సునామి సుధాకర్ నృత్యం చేస్తున్న దృశ్యం

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ ఉత్సవాల్లో జబర్దస్త్ టీం సందడి చేశారు. బుల్లెట్ భాస్కర్, నాటీ నరేష్, సునామీ సుధాకర్, తన్మయిలు ఉత్సవాలకు విచ్చేశారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో స్కిట్లతో సందడి చేశారు. అచ్చమ్మ తల్లి ఉత్సవాలకు రావడం, అమ్మవారి ఆశీస్సులు పొందడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కాపు, బలిజ జేఏసీ చైర్మన్ దాసరి రాము విచ్చేశారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం


పిప్పరలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

గణపవరం: హెల్మెట్ లేకుండా మోటార్‌సైకిల్ ప్రయాణం చట్టరీత్యా నేరమని, ప్రతి వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి గణపవరం మండలం పిప్పర మూడురోడ్ల కూడలిలో హెల్మెట్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పత్తేపురంలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం


ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం పత్తేపురం గ్రామంలో గడపకు మన ప్రభుత్వం ఉత్సాహంగా జరిగింది. దీంతో గడప గడపకు నియోజకవర్గంలో 126వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంకు హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబాన్ని పలకరించి ఆయా కుటుంబాలకు గత మూడేళ్లలో ప్రభుత్వ పరంగా అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సామాన్యుడు తన సమస్యను చెప్పాలంటే ఎవరికి చెప్పాలో తెలియక అనేక ఇబ్బందులు పడేవారన్నారు. నేడు గ్రామ సచివాలయాలతో ఆసమస్యకు ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. ప్రతి కుటుంబ సమీపంలో వలంటీరు అందుబాటులో ఉన్నారని వారి ద్వారా వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చే అవకాశం కలిగిందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని శాఖల అధికారులు గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 నుంచి 5 గంటల వరకూ అందుబాటులో ఉండటం ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. అర్హత ఉంటే పార్టీలకు, కులాలకు అతీతంగా పింఛన్ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రుద్రరాజు అప్పలరాజు, సొసైటీ అధ్యక్షులు సత్సమట్ల సతీష్‌కుమార్ రాజు, ఆర్‌బీకే చైర్మన్ పొత్తూరి బెనర్జీ ప్రసాదరాజు, ఎంపీటీసీ బొక్కా వెంకట లక్ష్మి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు వేగేశ్న జనార్ధన గోవింద రాజు, వేగేశ్న వెంకట సుబ్బరాజు, నంబూరి వెంకటకృష్ణ పెద్దిరాజు, కూనపురాజు విజయ రామరాజు, పొత్తూరి శ్రీనివాసరాజు తదితరులున్నారు.

గాంధేయం ప్రపంచానికే ఆదర్శప్రాయం


పెదనిండ్రకొలనులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, తదితరులు


పెదవేగి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పెదవేగి : జాతిపిత మహాత్మాగాంధీ అనుసరించిన విధానాలు ప్రపంచానికే ఆదర్శప్రాయమని పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్‌లు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజ్‌మనోజ్ అధ్యక్షతన గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఏఓ జాన్సన్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌ఓలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపూజీకి నివాళి

ఉంగుటూరు: మహనీయుడు మహాత్మాగాంధీజీ అని ఎంజీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో వి.వి.రామచంద్రమూర్తి, పి.వెంకటేశ్వరరావు, ఎరకునాయుడు, ఎస్.ఎన్.ఎస్.వి.ప్రసాద్,సునీల్‌కుమార్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఉప్పాకపాడు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ 75వ వర్ధంతి

దెందులూరు: దేశం కోసం స్వాతంత్ర్య పోరాటం చేసి ప్రాణాలర్పించిన జాతిపిత మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని దెందులూరు ఎంపీడీఓ ఏబీవీవీ లక్ష్మి అన్నారు. సోమవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ భీమరాజు ఆధ్వర్యంలో గాంధీజీ 75వ వర్ధంతి నిర్వహించారు. దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ ఆధ్వర్యంలో, నాగులదేవునిపాడులో బీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమడోలు: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమా బేగం హసీనా అన్నారు. పోలసానిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ 75వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో జాతిపిత అహింస నినాదంతో పని చేసారన్నారు. గాంధీజీ కలలు కన్నా స్వరాజ్య స్థాపనలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గాంధీజీ వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


నారాయణపురం ఎం జి జీ కళాశాలలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ లక్ష్మి, సిబ్బంది

గాంధీ భవనం పర్యటక కేంద్రంగా అభివృద్ధికి కృషి

నిడమర్రు: మాజీ మంత్రి, గాంధేయ వాది చింతలపాటి మూర్తి రాజు పెదనిండ్రకొలనులో నిర్మించిన మహాత్మా గాంధీ భవనం పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గాంధీ భవనంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ 75వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గాంధీ విగ్రహంకు ఘన నివాళులర్పించి గాంధీ సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షులు చర్ల మృదుల, అభివృద్ధి కమిటి సభ్యులు అధ్యక్షులు భీమరాజు, పరమయ్య ఎంపీపీ, ఉమ్మడి జిల్లా సర్వోదయ మండలి అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు, మానవత మాజీ జిల్లా అధ్యక్షుడు సాగిరాజు జానకి రామరాజు తదితరులున్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి వేడుకలు

పెదపాడు: జాతి పిత మహాత్మాగాంధీ సేవలను ఎన్నడూ మరువలేమని పలువురు అధికారులు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్విహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈకార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, ఏపీఎం దాసరి సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు అవసరమైన మందులను వాడాలి

పెదపాడు: రైతులు ఆరుతడి పంటలైన పెసర, మినుము పంటలకు అవసరమైన మేరకు పురుగు మందుల పిచికారి చేయాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో అపరాల పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని ఏమందు అవసరమో తెలుసుకుని వాటిని మాత్రమే పిచికారి చేయాలని సూచించారు. అధికంగా పురుగుమందులు వినియోగం ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో అప్పనవీడు గ్రామ ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

పెదపాడు : మండలంలోని పునుకొల్లు గ్రామంలో కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటగూడెం కమ్యూనిటీ హెల్త్ అధికారి తాళ్లూరి శ్రీదేవి మాట్లాడుతూ ఎవరికైనా వంటిపై మచ్చలు వచ్చి నొప్పి దురద లేకుంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రజలు కుష్టువ్యాధి పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని గ్రామస్తులతో కలిసి వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశావర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు బువ్వనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం బువ్వనపల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో బువ్వనపల్లిలో ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతోందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఉదయం 8 గంటల నుంచి అల్లుమోలు సత్తిబాబు నివాసం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతోందన్నారు. ఈ కార్యక్రమంకు అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గొవాలని కోరారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి


కురెళ్లగూడెం వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సురేష్‌కుమార్

భీమడోలు: రోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద సోమవారం రాత్రి హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే వాహనదారులు అత్యంత జాగ్రత్తగా రాకపోకలు సాగించాలన్నారు. పగలు, రాత్రి వేళల్లో కచ్చితంగా హెల్మెట్లను ధరించాలని, లేని పక్షంలో జరిమానాలు విధిస్తామన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి


కొవ్వలిలో గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు

దెందులూరు: గృహసారథులు, జగనన్న సచివాలయ మండల కన్వీనర్లు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు అన్నారు. సోమవారం కొవ్వలిలో వైఎస్సార్‌సీపీ గృహసారథుల సమావేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాటి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి లక్ష్యమన్నారు. వలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ఆన్‌లైన్ ప్రక్రియలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సర్పంచ్ మధులతా గంగాధర్, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి రంగారావు, జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, నాయకులు గొల్లా వీరాస్వామి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

వట్టి వసంత్ మరణం కొల్లేరు ప్రాంతానికి తీరనిలోటు


గణపవరం పంచాయతీ వద్ద వట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

గణపవరం: మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు వట్టి వసంత్ కుమార్ ఆకస్మిక మరణం జిల్లాకు, ముఖ్యంగా కొల్లేరు ప్రాంతానికి తీరనిలోటని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము అన్నారు. సోమవారం గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద వట్టివసంతకుమార్ సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ నీతి నిజాయితీలతో, విలువలతోకూడిన రాజకీయాలు నడిపారని కొనియాడారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయం విడుదల చేసిన ప్రకటలో రాష్ట్రంలో 3,30,145 మంది రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్స్ రూ. 330.15 కోట్లు జగనన్న చేదోడు పథకంలో వరుసగా మూడో ఏడాది బటన్ నొక్కి వారిఖాతాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నగదు జమ చేయడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలో బీసీలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయం ఉపాధి, మెరుగైన జీవన విధానం, అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేశారన్నారు. ప్రతి రోజూ ఏ సభలోనైనా, ఏ సమావేశంలోనైనా నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీ, నా మైనార్టీ ప్రజలని పరితపించే ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ఏపీ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని, అత్యధికంగా జీడీపీ ప్రకారం పెరుగుదల 11.43 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కన్నా ఏపీ ప్రభుత్వం 14.43 శాతం గ్రోత్ రేటుతో దేశానికి ఆదర్శంగా పరుగెడుతుందన్నారు. మీ అందరి చల్లని దీవెనలు మీ బిడ్డ సీఎంపై ఉండాలని, ఇంకా మంచి చేసే రోజులు పరిస్థితులు రావాలని గ్రామాలు, అందరి అభివృద్ధి చెందాలని మీ చల్లని దీవెనలు సీఎంపై, ప్రభుత్వంపై ఉండాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


బాల్య వివాహాల నిషేధ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్నేహన్

పెదవేగి : బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని సామాజిక ప్రవర్తన మార్పు సమాచార (ఎస్.బి.సి.సి) విభాగం జిల్లా కోఆర్డినేటర్ టి.యన్.స్నేహన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన పెదవేగి గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రక్తహీనత-బాల్య వివాహాలు నిర్మూళన అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహన్ మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం గుట్టు చప్పుడు కాకుండా బాలలకు పెళ్లి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష రూ. లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు. రక్త హీనత లేకుండా ఉండాలంటే పాఠశాలల్లో జగనన్న గోరు ముద్ద, అంగన్ వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ సక్రమంగా అమలయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, సచివాలయ వేల్ఫేర్ కార్యదర్శి నజీర్, మహిళా పోలీసు ఎం.జ్యోతి ,ఏ.ఎన్.ఎం లు మౌనిక, పుష్పలత ఆశా వర్కర్లు పాఠశాల ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏపూరులో పౌర హక్కుల దినోత్సవం

పెదపాడు: ప్రభుత్వం ప్రతి నెల 30 వ తేదీన పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు తెలిపారు. మండలంలోని ఏపూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులంతా సమానమేనన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘ సమావేశాలు విజయవంతం చేయాలి


భీమడోలులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు

భీమడోలు: మండలంలో ఫిబ్రవరి 3వ తేదీ శుక్రవారం 9 గంటలకు భీమడోలు జంక్షన్‌లో జరగనున్న రైతు సంఘం జిల్లా సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భీమడోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సమావేశాల కరపత్రాలను సోమవారం ఆ సంఘం నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. రైతు సంఘం అన్ని పంటల రైతాంగం సమస్యలపై కృషి చేస్తుందన్నారు. జిల్లాలోని రైతాంగాన్ని మరింత సంఘటితం చేసేందుకు గ్రామ స్థాయిలో రైతు సంఘాన్ని బలోపేతం చేసేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతు సంఘం సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. రైతాంగ సమస్యలపై రైతు సంఘం చేస్తున్న కృషిలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కొలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.